# మంచి మనిషికి స్వాగతం!!

- ఎన్. శివనాగేశ్వరరావు

'కాత్యా! నా మాట విను. క్రిష్ణ మంచివాడు. అతన్ని పెళ్ళి చేసుకుంటే నీ జీవితం బాగుంటుంది'' అన్నాడు విశ్వనాథం నచ్చచెప్పేరీతిలో.

''నాన్నగారూ! మీరామాట ఇప్పటికి పదిసార్లు చెప్పారు. నేనూ నా అభిప్రాయం మరోసారి చెప్తున్నాను. ఆ కిళ్ళీబడ్డీ వాడ్ని చేసుకోవడం నాకేమాత్రం ఇష్టం లేదు'' ఖచ్చితంగా చెప్పింది కాత్యాయని.

'''నేనివ్వగలిగిన కట్నానికి ఉద్యోగస్తులు దొరకరు. ఆ విషయం కూడా నీవు గమనించాలి.''

''ఇద్దరమ్మాయిలనూ ఉద్యోగస్తులకు కట్టబెట్టిన మీరు నా విషయంలో ఎందుకలా చేయలేకపోతున్నారు? ఉన్నదంతా వారికే ఊడ్చి పెట్టడం వల్లనే ఇటువంటి పరిస్థితి దాపురించింది. మీరు మరో అమ్మాయి ఉందన్న విషయం అప్పుడే గుర్తుంచుకుని ఉంటే బావుండేది'' ఆ మాట అనడానికి కాత్యాయని ఏ మాత్రం సంకోచించ లేదు. చాలా ధైర్యంగా, అంతకుమించి నిస్సంకోచంగా మనసులోని మాట బయటపెట్టింది.

అది విన్న విశ్వనాథం కూతురి వంక సాలోచనగా చూసాడు. పెంచి పెద్ద చేసిన కూతురు తనను నిలదీస్తుంటే అతని హృదయంలో ఆవేదన సుళ్ళు తిరిగింది.

''అమ్మా! కాత్యా! తండ్రి బిడ్డలందరి క్షేమం కాంక్షిస్తాడు. అందుకే నిన్ను క్రిష్ణను పెళ్ళి చేసుకోమని అడిగాను. ఆడపిల్ల చేసుకోబోయేవాడి ఆర్థికస్థితే కాదు మనసు కూడా చూడాలి. నీకంతగా ఉద్యోగస్తులే కావాలంటే అప్పోసప్పో చేసి అటువంటి వాడితోనే పెళ్ళి జరిపిస్తాను'' అన్నాడు విశ్వనాథం.

''అలా చేయండి. సంతోషిస్తాను'' అంది కాత్యాయని.

క్రిష్ణ విశ్వనాథం గారి శిష్యుడు. అతని వద్ద టెన్త్‌క్లాస్ వరకు చదివాడు. తరువాత ఇంటర్ పూర్తి చేసి మరిక చదివే స్తోమత లేక పాన్ షాప్ పెట్టుకున్నాడు. ఆదాయం బాగానే ఉంది. అతని తల్లిదండ్రులు కొడుక్కి సంబంధాలు చూస్తున్నారని విశ్వనాథంకి తెలిసింది. క్రిష్ణ తమ కులం వాడే. అందునా మంచివాడు. కిళ్ళీకొట్టు మీద వస్తున్న ఆదాయంతో భార్యాబిడ్డల్ని పోషించుకోగలడు అని ఆలోచించిన విశ్వనాథానికి అతన్ని తన అల్లుడ్ని చేసుకుంటే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది.

ఆ విషయమ్మై చాలా రోజులు ఆలోచించాక క్రిష్ణతో తన మనసులోని మాట చెప్పాడు. అది విన్న క్రిష్ణ ''మాస్టారూ! మీరు నా మంచిని కాంక్షించేవారు. మీవంటి సహృదయులతో సంబంధం కలుపుకోవడం కంటె సంతోషమేముంది?'' అన్నాడు.

క్రిష్ణ దగ్గర భరోసా తీసుకున్నాక విశ్వనాథం ఆ విషయం కూతురి దగ్గర ప్రస్తావించాడు. అందుకు కాత్యాయని ప్రతిస్పందించిన తీరు అతనేమాత్రం ఊహించలేదు.

కాత్యాయని సుస్పష్టంగా ''ఉద్యోగస్తుడినే చేసుకుంటానుగాని కిళ్ళీ బడ్డీవాడ్ని చేసుకోను'' అని చెప్పాక తనావిషయం క్రిష్ణతో మాట్లాడి ఎంత తప్పు చేసాడో విశ్వనాథానికి అర్థమయింది. కూతురంత వివేక రహితంగా మాట్లాడుతుందని ఊహించక క్రిష్ణతో పెళ్ళి విషయం మాట్లాడి, అతని హృదయంలో ఆశలు రేపి, ఇప్పుడు కాదంటే అతనెంత చిన్నబుచ్చుకుంటాడో విశ్వనాథం సరిగానే ఊహించాడు.

అందుకే ఆ సాయంత్రం క్రిష్ణ కిళ్ళీ బడ్డీ దగ్గరకు వెళ్ళినప్పుడు ఎప్పటిలా నవ్వుతూ పలకరించ లేకపోయాడు. మాస్టారు ముభావంగా ఉండడం గమనించిన క్రిష్ణ అతన్ని కూర్చోబెట్టి చల్లటి గోలీ సోడా కొట్టిచ్చాడు. అది త్రాగి విశ్వనాథం కొంత సేద తీరాడు. ''ఏం మాస్టారూ! అలా ఉన్నారు?'' అని అడిగాడు క్రిష్ణ.

అతని దగ్గర నిజం దాచడం విశ్వనాథానికి ఇష్టం లేకపోయింది. ''నీవు నన్ను క్షమించాలి కృష్ణా'' అన్నాడాయన. అదివిన్న క్రిష్ణ ఖిన్నుడై ''అదేం మాట మాస్టారూ? ఇప్పుడేం జరిగిందని?'' అన్నాడు.

విశ్వనాథం తనకు, కూతురికి మధ్య జరిగిన సంభాషణ క్లుప్తంగా చెప్పాడు.

అదివిన్న కృష్ణ తేలిగ్గా నవ్వేసి ''ఇందులో క్షమార్పణ కోరడానికేముంది మాస్టారూ! నిజానికి కాత్యాయన్ని అభినందించాలి. మనసులోమాట దాచుకోకుండా చెప్పింది. తనలా చెప్పక అయిష్టంతో నన్ను పెళ్ళాడితే జీవితాంతం ఇద్దరం నరకం అనుభవించాలి'' అన్నాడు.

క్రిష్ణ మాటలు వినగానే విశ్వనాథం హృదయం తేలికయింది. క్రిష్ణ ఆ విషయాన్ని అంత తేలికగా తీసుకుంటాడని అతనూహించలేదు. ''నీవు మంచి వాడివి క్రిష్ణా! నిన్ను కాదనుకున్న నా కూతురు దురదృష్టవంతురాలు'' అన్నాడాయన.

''ఈ విషయం ఇంతటితో వదిలేద్దాం మాస్టారూ! ఇకమీరు దాని గురించి ఆలోచించకండి'' అన్నాడు క్రిష్ణ.

''అలానే'' అన్నాడుగాని విశ్వనాథం ఆ విషయం గురించి చాలా కాలం బాధపడ్డాడు.

విశ్వనాథం, కూతురు కోరినట్లు ఉద్యోగస్తుడి సంబంధం కోసం వెదికారు. కాత్యాయని పెళ్ళి చూపులకు హాజరయింది. అయితే వచ్చిన కుర్రాళ్ళకు కాత్యాయని నచ్చినా ఆమె తండ్రి ఇవ్వగలిగిన కట్నం నచ్చలేదు.

కాత్యాయని, తండ్రితో 'క్రిష్ణను చేసుకోన'ని ఖరాఖండిగా చెప్పేసాక అతను, కూతురితో మాట్లాడ్డం తగ్గించేసాడు. ఆ మార్పు కాత్యాయని గమనించినా ఖాతరు చేయలేదు. తను మెత్తబడితే తండ్రి ఆ కిళ్ళీకొట్టువాడితో పెళ్ళి ఖాయం చేయగలడని ఆమె భావించింది. అయితే తన మాటలకు తండ్రి హృదయం ఎంత గాయపడిందో గ్రహించలేకపోయింది.

ఒక రాత్రి విశ్వనాథానికి తీవ్రంగా గుండెపోటు వచ్చింది. అతను బాధతో విలవిల్లాడుతుంటే కాత్యాయని ఆటో పిలవడానికి పరుగుతీసింది. అయితే హాస్పిటల్‌కి తీసుకువెళ్ళేలోపే విశ్వనాథం ప్రాణాలు విడిచాడు. తండ్రి మరణం కాత్యాయనికి విద్యుద్ఘాతమే అయింది.

విషయం తెలిసి ఆమె అక్కలు, బావలు వచ్చారు.

విశ్వనాథం అంత్యక్రియలు జరపడానికి సమయానికి కాత్యాయని వాళ్ళ దగ్గర డబ్బుల్లేవు. ఆమె తల్లి జానకమ్మ మనసు చంపుకొని కూతుళ్ళతో ''అల్లుళ్ళను అడిగి చూడండి. త్వరలోనే తిరిగి ఇచ్చేస్తాను'' అంది. విషయం తెలిసిన అల్లుళ్ళు ''ఉన్నంతలోనే జరిపించేయండి. ఘనంగా చేయడానికి ఇదేం శుభకార్యం కాదు'' అన్నారు.

అది విన్న జానకమ్మ గొల్లున ఏడ్చింది. కాత్యాయని హృదయం భగ్గున మండింది. తండ్రి తమనెంత అపురూపంగా పెంచారో కాత్యాయని మరచిపోలేదు. మెడలోని గొలుసు తీసి తల్లితో ''అమ్మా! ఇది అమ్మేద్దాం'' అంది.

జానకమ్మ, కాత్యాయన్ని వాటేసుకుని ''మనకెవరూ లేరే తల్లీ!'' అని ఏడ్చింది.

అదే సమయానికి అక్కడకు వచ్చిన క్రిష్ణ, జానకమ్మను ప్రక్కకు పిల్చి ''అమ్మగారూ! మాస్టారు మీకే కాదు. నాకూ కావలసిన వారే. ఆయన మరణం నాకెంతో బాధను మిగిల్చింది.'' అంటూ ఆమె చేతిలో కొంత డబ్బు ఉంచారు.

డబ్బును చూడగానే జానకమ్మ దుఃఖం మరింత పెరిగింది. ఆమెకు క్రిష్ణ తెలుసు. అతనికి కాత్యాయన్నిచ్చి పెళ్ళి చేద్దామనుకుంటే ఛీ కొట్టిన సంగతి తెలుసు. అటువంటిదిప్పుడు ఆ అబ్బాయి దగ్గర సహాయం అందుకోవడం ఆమెకు చిన్నతనమనిపించింది.

అందుకే ''వద్దు క్రిష్ణా! మాకెవరి సహాయం

అక్కర్లేదు. ఈ గొలుసు అమ్మి డబ్బు తెచ్చిపెట్టు. ఆ సహాయం చాలు'' అంది.

క్రిష్ణ, కాత్యాయని బోసిమెడ చూసాడు. అతను, జానకమ్మతో ''అమ్మగారూ! నేనిస్తున్న ఈ రెండు వేలు నావికావు. ఈ డబ్బు మాస్టారు నాకు అప్పుగా ఇచ్చారు. దయచేసి నన్ను నమ్మండి. ఈ డబ్బుతో అంత్యక్రియలు జరిపించండి'' అన్నాడు.

అతని కళ్లల్లోని కన్నీటిని చూసి జానకమ్మ మరేం మాటాడకుండా డబ్బు తీసుకుంది.


అంత్యక్రియలు ముగిసాయి.

దినం రోజున కాత్యాయని బావలిద్దరూ మరలా వచ్చారు. పెద్ద బావ వచ్చిన బంధువులతో చీట్ల పేకాడుతుంటే..చిన్న బావ ఫుల్‌గా బ్రాందీ త్రాగివచ్చి భోజనంలో మాంసం కూరలేదని భార్యను నీచంగా తిట్టాడు.

తండ్రి చనిపోయినరోజు చిల్లిగవ్వకూడా సహాయం చేయని బావలమీద ఏవగింపు పెంచుకున్న కాత్యాయనికి దినం రోజు దృశ్యాలు చూసాక జుగుప్స కలిగింది.

ఆమెకు క్రిష్ణ జ్ఞాపకానికి వచ్చాడు. పిలవకుండానే వచ్చి నిండు మనసుతో డబ్బిచ్చిన ఆ మంచి మనిషిని తన బావలతో పోల్చడానికి ఆమె సిగ్గుపడింది.

''అమ్మా! కాత్యాయనీ! క్రిష్ణ వంటి మంచి మనిషితో జీవితం పంచుకోవడం నిజంగా అదృష్టం తల్లీ!'' అన్న తండ్రి మాట జ్ఞాపకానికి వచ్చింది. తండ్రి మాట పెడ చెవిన పెట్టి అతనికి హృదయ క్షోభ కలిగించినందుకు కాత్యాయని కుమిలిపోయింది.



తన బావలకు ఉద్యోగాలున్నాయి. కానీ ఏం లాభం? హృదయంలేని కర్కశులు. క్రిష్ణకు ఉద్యోగం లేక పోయినా మంచి మనసుంది. ఆ విషయమై తండ్రి పదే పదే చెప్పినా నిర్లక్ష్యం చేసినందుకు తనను తాను నిందించుకుంది.

విశ్వనాథం మరణానంతరం అతని తాలూకు ఇన్స్యూరెన్స్ డబ్బు అందింది. ఆ సొమ్ము అందుకున్న జానకమ్మ కంట నీరు పెట్టుకుని ''అమ్మా! కాత్యా! మీనాన్న చనిపోయి నీ కోరిక తీర్చారు. ఈ డబ్బుతో నీకు మంచి ఉద్యోగస్తుడితో పెళ్ళి జరిపిస్తాను. నీ కోరిక తీరిస్తే ఆయన ఆత్మ శాంతిస్తుంది'' అంది.

కాత్యాయని మౌనం దాల్చింది.

ఆ సాయంత్రమే కాత్యాయని క్రిష్ణ కిళ్ళీ బడ్డీ దగ్గరకు వెళ్ళింది. ఆమెను చూడగానే క్రిష్ణ పలకరింపుగా నవ్వాడు. ''బావున్నావా కాత్యాయనీ!'' అని ఆప్యాయంగా అడిగాడు.

ఆమె, అతని కళ్లల్లోకి సూటిగా చూసి ''క్రిష్ణా! నాకో నిజం చెప్పగలవా?'' అంది.

''ఏమిటది?'' అన్నాడు క్రిష్ణ.

''మా నాన్నగారు నిజంగానే నీకు డబ్బు అప్పుగా ఇచ్చారా?''

క్రిష్ణ చిన్నగా నవ్వాడు. ''లేదు. మీ అమ్మగారు డబ్బు తీసుకోవడానికి అభిమానపడుతుంటే అలా చెప్పాను'' అన్నాడు.

కాత్యాయనికి అతని హృదయౌన్నత్యం అర్థమయింది.

''నన్ను క్షమించు'' అందామె తలదించుకుని.

''ఎందుకు?''

ఆశ్చర్యపోయాడు క్రిష్ణ.

''నీగురించి నాన్నగారు ఎంతో గొప్పగా చెప్పారు. అవివేకంతో నీతో పెళ్ళికి నేనొప్పుకోలేదు'' అంది.

''ఇప్పుడవన్నీ ఎందుకు?'' అన్నాడు క్రిష్ణ. అతని కళ్లల్లో లీలగా కదిలిన విషాద వీచికను ఆమె కనులు గుర్తించాయి.

''నీవు క్షమిస్తే..''ఆగింది కాత్యాయని.

''క్షమార్పణ ఎందుకు? మాస్టారి కూతురిగా నీవంటే నాకెప్పుడూ అభిమానమే'' అన్నాడు క్రిష్ణ.

''నిండు మనసుతో మంచి మనిషికి స్వాగతం పలుకుతున్నాను. నా ఆహ్వానం మన్నిస్తావా?'' అంది కాత్యాయని.

క్రిష్ణ ఆమె వంక సంతోషంగా చూశాడు.

ఆమెకు తండ్రి జ్ఞాపకానికి వచ్చాడు. ''నాన్న ఆత్మ తప్పక శాంతిస్తుంది'' అనుకుంది కాత్యాయని. ఆమె మనసు ప్రశాంతమయింది.

★